# రాజీప్రయత్నము

★

"శివం"గారి కథ

తను ప్రవేశించేది బాంబులఫ్యాక్టరీయో-క్షేమమందిరమో, కూడా నిర్ధరించుకోనకుండానే, దేనికయినా సన్నద్ధుడనే అనే నిర్ణయము ముఖముపయి ప్రస్ఫుటముగా ప్రతిఫలిస్తూండగా, నారాయణమూర్తి డ్రాయింగు రూములోనికి అడుగువేసేడు. మధ్యాహ్నము భోజనముల ముందు వాగ్వాదము వకచివరకంటూవచ్చి యింకా ముగియలేదు. మరి తన భార్య సుందరమ్మ, యిప్పుడా వాగ్వాదాన్ని తిరిగి ప్రారంభిస్తుందా, లేక రాజీ చేసుకుంటుందా అనేదే పెద్ద ప్రశ్న. 'టీ టేబులు' ప్రక్కన ఎడముగావున్న వాలు కుర్చీలో...ఆమె నిశ్చింతగాను, ముభావముగాను కూర్చుని వున్న పద్ధతి...ఆమె యుద్ధానికి తయారని చెపుతూంది. పొగమంచుపట్టే యీ దినాల్లో తన కళ్ళజోడుకూడా—మసకగావున్న గదిలోని ఆమె ముఖము మీది భావాలని కనిపెట్టడానికి ... అణుమాత్రమయినా సహాయపడకుండా వుంది.

నిశ్శబ్దమును భేదిస్తూ... ఆమె తరహాను పరీక్షించడానికీ, పూర్వపు అభిప్రాయ భేధములు మరచిపోయినానని విన్నవించుకోడానికో అన్నట్లు...అతను మత సంబంధమయిన వాక్యము నొకటి వదిలేడు గాలిలోనికి. నిజానికి వారి వైవాహిక జీవితములో అనేక పర్యాయములు, యిటువంటి వాక్యములే వారి నిద్దరినీ మరల మరల దగ్గరకు కలిపేయి. అందులో ముఖ్యముగా ఆరుగంటలకీ ఎనిమిది గంటలకూ మధ్య—తాము చలికాలములో మూడోసారి కాఫీ త్రాగుతూన్న వేళల్లో ... అనడానికి అలవాటు పడిన వాక్యము లవి. తను అనిన మాటను ఆమోదించినట్లు సుందరమ్మ వద్దనుంచి సమాధానమే లేదు. నిజమునకు ఆ వాక్యానికి ఎవ్వరూ—ఎదిరించి సమాధానాన్ని చెప్పలేరుకూడాను.

పర్షియను రగ్గుమీద 'టార్క్విన్యో', సుందరమ్మ చేస్తూన్న అపహాస్యానికి అతీతమయిన విముఖతతో... వెచ్చగా పడుకొనివుంది. పనిచేసే కుర్రవాడిలో విప్లవోద్దేశాలు వుండటమువలన ఆ కుక్కకు 'టార్క్విన్యో' అనే నోరు తిరుగని పేరును, దానికి నామకరణంచేసేడు. కాని, ఆ కుక్కకు నామకరణంచేసే విషయం తమకు విడిగావదలివేస్తే—తనూ, తన భార్యాకూడా దానిని...బుల్లి పేరుతో నాజూగ్గా 'చిట్టీ' అని పిలిచేవారు. కాని, తామే దానికి నామకరణంచేసి తీరాలనే మూర్ఖపుపట్టుదల తమలో ఏనాడూ లేదు.

పొగలు కక్కుతూన్న కాఫీని తన కప్పులో పోసుకున్నాడు మూర్తి—ముందు కార్యక్రమం ఏమిటని ఆలోచిస్తూనే. నిశ్శబ్దమును చీల్చుకొని సుందరమ్మ వద్ద నుండి...ఏ మాత్రమూ స్నేహపూర్వకమయిన వాక్కురాక పోగా, తనే రాజీప్రయత్నాలు చేయ నడుముకట్టుకుంటూ, "ప్రొద్దున్న భోజనములముందు అన్నమాట, లోకానికి వుద్దేశించి అనినది కాని నిన్ను గురించికాదు. నిన్ను అన్నానని బాధపడుతున్నావు కాబోలును" అన్నాడు.

సుందరమ్మ తన మాటను తాను నిలబెట్టుకోడానికి నిశ్శబ్దాన్నే స్వీకరించింది. వ్రేలాడుతూన్న పంజరములోనుంచి చిలుక...యిదే సమయమని చిన్నకూనిరాగాన్ని తీయగా. ఏ త్యాగరాజ కీర్తనో నేర్పివుండి వుంటే బాగుండునని మూర్తి అనుకున్నాడు. అటువంటి కీర్తనలంటే యిద్దరకూ యిష్టమే. నిజానికి కళాదృక్పథము యిద్దరిదీ వకే పంథాన

## దేశచరిత్ర

నడిచింది. ఇరువురకూ వకే సినిమాలు, పాటలు, చిత్రాలు నచ్చేవి.

నిశ్శబ్దము కాలముతోబాటు, తేనెవలె జారిపోతూంది. న్యాయమునకు...సుందరమ్మ మూగతనము...తను వుపన్య

నిస్తూన్న నాలుగు నిమిషములూవుండి...తర్వాత అంతమయి ధ్వనుల నీనేది. మూర్తి పాలకప్పుతో 'టార్క్వినియో' ప్లేటువద్దకు నడచి పాలను అందులో పోసేడు. ప్లేటు యిదివరకే పాలుతో నిండియుండటంవలన పాలు పొంగి నేలను పారలేయి. సునకము...ఆశ్చర్యముతో మిళితమయిన కుతూహలముతో యజమాని ముఖాన్ని చూస్తూ — ప్రేమతో ఆహ్వానించింది...వచ్చి, పారలిపోయిన పాలును తనతో పంచుకోమన్నట్లు. టార్క్వినియో తన జీవితములో అనేక పాత్రలు స్వీకరించడానికి సిద్ధమయినదిగాని ... అలుకుడు గుడ్డ పాత్రకు మాత్రము ఏనాడూ అంగీకరించలేదు.

"మన దెబ్బలాటకి అర్థంలేదని నీవనుకోడము లేదూ?" అన్నాడు మూర్తి.

ఆమె ఆ విధముగానే అనుకున్నదేమోగాని, అట్లాగే అనుకుంటున్నానని మాత్రము నోటితో అనలేదు.

"కొంతవరకూ తప్పునాదేనని నేను వప్పుకుంటాను." సంతోషము కాస్తయింకి పోతూండగా అన్నాడు మళ్ళీ ముసలి మూర్తి "ఎంత చెడ్డామనం మానవ మాత్రులము. ఆ సంగతే మరచిపోయినట్లున్నావు నువ్వు."

చిలుక తిరిగి తనకి వచ్చిన వక్క కూనిరాగాన్ని తీసింది. తన గాననైపుణ్యాన్ని ప్రదర్శించాలని పాటుపడే, క్రొత్త నటుడిలాగ. మూర్తిని నీరసమే ఆవహించింది అన్నట్లు వునూరుమని పోయేడు...ఆమె పటుత్వాన్ని చూచి. సుందరమ్మ కాఫీకూడా త్రాగడము లేదు. బహుశా ఆమె వంట్లో కులాసాగాలేదు కాబోలు. కాని ఆమె ఆరోగ్యము సరిగా లేక పోయినట్లయితే "అబ్బా! నేను యీ అజీర్ణముతో ఎంతగా బాధపడుతున్నానో ఆ రామచంద్రునికే తెలియాలి" అంటూ ప్రారంభించి తీరాలి మరి. అది ఆమె అలవాటు. కాని, మరి యీ నాడు అటువంటి ప్రస్తావన రాకపోవడము చూస్తే, ఆమె ఆరోగ్యము బాగానే వుండి వుండాలి!

మూర్తి గ్రహించేడు—తనని అనవసరముగా బాధిస్తూ, ఆమె తన కసిని తీర్చుకుంటూందని. తను మాత్రం ఏంచేయగలడు యిక—రాజీకి దిగక. మామూలుగనే మూర్తి ప్రారంభించేడు—రగ్గు మధ్యకు వచ్చి — టార్క్వినియో వీలిచ్చినంత జాగాలో నిలబడి. "తప్పంతా నాదే అయి వుండొచ్చు. మన పరిస్థితులు మామూలు స్థితిలోకి రావడానికి...తప్పంతా నేనే నెత్తిపయిన వేసుకుంటాను—అవసరమొస్తే."

తరువాత తనకి తనే ఆశ్చర్యపోయినాడు, నిజానికి తప్పంతా తనదే ఎట్లా అవుతుందీఅని. ఏది ఎట్లావున్నా... గృహపరిస్థితులు ... ప్రశాంత స్థితికి రావడానికి ... తను యిటువంటి చిన్నచిన్న తప్పులు ఎన్నయినా నెత్తిన వేసుకొనడానికి సంసిద్ధుడే.

సుందరమ్మ మాత్రము అతను—తప్పును వప్పుకున్నందుకు—తన విజయాన్ని ఏ విధమయిన సంజ్ఞ ద్వారాను కూడా తెలుప ప్రయత్నించలేదు.

మూర్తి కళ్ళజోడు కొననుండి ఆమె వైపు విచిత్రంగా చూచేడు. ఆమెతో వాగ్వాదము రభసతో అంతమవ్వటము తనకు కొత్త కాదు. కాని-తనకి తనే—వక్కడూ గోడలతో మాట్లాడుకోడం హాస్యాస్పదము!

"నేను దుస్తులు వేసుకొని—మీటింగుకు వెడుతున్నా" తన స్వరంలో కొంత పటుత్వం—ధీమా తెచ్చిపెట్టుకోవాలని ప్రయత్నంతో అన్నాడు తలుపు వయిపునడుస్తూ.

తలుపువద్ద తిరిగి తనలో తను 'మరో ప్రయత్నం' అనుకుంటూనే "మన ప్రవర్తన చిలిపిగా లేదూ?" అని అన్నాడు. దీనికీ సమాధానము లేదు.

నారాయణమూర్తి వెనుక తలుపు మూసుకుంటూండగా టార్క్వినియో మూర్తి వట్టి బుద్ధిహీనుడని అనుకుంటూనే కాలము వ్యర్థపరచక, టేబిలుపయికి ఎగిరినుంచుని, అక్కడనుండి పుస్తకాల బీరువాపయికి గెంతి, పంజరములోని చిలుకను...మొదటిసారి చూచినట్లు చూచింది—టార్క్వినియో. ఈ వుపాయం వక్కసారి దానికి తట్టినది కాదు. ఎన్నాళ్ళనుండో—సమయము కోసం ఎదురు చూస్తూందీ సునకము. అకస్మాత్తుగ చిలుక—కుక్కను—పెద్దపులి చూచినట్లు చూచి—భయంతో రెక్కలు కొట్టుకొంటూ అరువసాగింది. రెండు రూపాయల విలువయిన—తన పెంపుడు చిలుకని—కుక్క ఫలహారము చేయబోతూన్నా సుందరమ్మ జోక్యము కలుగ జేసికోలేదు.

కారణం? రెండుగంటలక్రితమే ఆమె అకస్మాత్తుగ భౌతిక ప్రపంచానికి అతీతురాలయిపోయింది.

★